క్లుప్తంగా

నేడు వేంకటేశ్వరస్వామి వ్రతం



ఉభయ దేవేరులతో కొలువుదీరిన బాలబాలాజీ స్వామి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయంలో శనివారం వేంకటేశ్వర స్వామి వ్రతం ఏర్పాటు చేశామని ఆలయ ఈఓ గ్రంధి మాధవి శుక్రవారం తెలిపారు. చైత్ర శుద్ధ బహుళ ఏకాదశి సందర్భంగా శనివారం ఉదయం 9 గంటలకు వేంకటేశ్వరస్వామి వ్రతం ప్రారంభిస్తామన్నారు. నూతనంగా ప్రవేశ పెడుతున్న ఈ వ్రతంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యాకానుక స్టాక్ పాయింట్ పరిశీలన



లక్కవరంలో స్టాక్ పాయింట్ పరిశీలిస్తున్న డీఈఓ

మలికిపురం/మామిడికుదురు: పాఠశాలల్లో విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం అందించనున్న విద్యాకానుక పంపిణీ కోసం లక్కవరం, లూటుకురుర్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్లను శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) ఎం.కమలకుమారి పరిశీలించారు. స్టాక్ పాయింట్లో రికార్డులను ఆమె సరి చూశారు. ఆమె వెంట సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం కూడా పాయింట్ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 వైవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఆర్ శేఖర్, ఎంఐఎస్ ఆర్ రవి, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం

పి.గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా సమస్యలపై చర్చించకుండా సమావేశం ముగించారు. ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి, మండల పరిషత్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లో వోల్టేజీతో ఇబ్బందులు

అంబాజీపేట: మాచవరం కొర్లపాటివారి పాలెం సత్యసాయి మందిరం ప్రాంగణం వద్ద లో వోల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవీ పాలెంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ అధికారులకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. లోవోల్టేజీ కారణంగా ఫ్యాన్లు, విద్యుత్ మోటార్లు పనిచేయక అవస్థలు పడుతున్నామన్నారు. అధిక ఉష్ణోగ్రతలు ఓ పక్క.. ఉక్కపోత మరోపక్క అధికంగా ఉండటంతో ఇళ్లలో సేదతీరుదామన్నా ఫ్యాన్లు, ఏసీలు పని చేయక వృద్ధులు, చిన్నారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి లో వోల్టేజీ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్సీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష పథకాన్ని వినియోగించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ముక్కామల పీహెచ్సీ వైద్యాధికారి జీవీ గీతాంజలి అన్నారు. చిరతపూడిలో ఆరోగ్య సురక్ష రెండో విడత శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గీతాంజలి మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష పథకం రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుత వాతావరణంలో 40 ఏళ్లు దాటిన వారంతా బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకోవాలని వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం రోగులను, గర్భిణులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో సీహెచ్ఓ రవికుమార్, ఆరోగ్య మిత్ర ధనరాజ్, హెల్త్ సూపర్వైజర్ రాధా నరసింహం, హెల్త్ అసిస్టెంట్లు వెంకటేష్, ప్రసాద్, ఎంఎల్హెచ్పీ రీష్మా, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేది రోడ్డు సెంటర్లో శుక్రవారం బైక్ బలంగా ఢీకొని స్థానిక కూరగాయలు వ్యాపారస్తుడు సి.పద్మనాభంకు తీవ్ర గాయాలయ్యాయి. ఓ యువకుడు నడుపుతున్న బైక్ అదుపుతప్పి బలంగా పద్మనాభాన్ని గుద్దినట్టు స్థానికులు తెలిపారు. మలికిపురం మండలం కత్తిమండకు చెందిన అతడు అంతర్వేది రోడ్డు సెంటర్లో వ్యాపారం చేస్తున్నాడు. సఖినేటిపల్లికి చెందిన 108 అంబులెన్స్ టెక్నీషియన్ ఎస్.రాము సమాచారం అందుకుని హుటాహుటిన ఘటన స్థలానికి వచ్చారు. డ్రైవర్ సురేంద్ర సాయంతో పద్మనాభంను మలికిపురం ఒక ప్రైవేటు ఆసుపత్రికి రాము తరలించారు. అంబులెన్స్లో ఫస్ట్ ఎయిడ్ చేసినట్టు, కాలు విరిగినట్టు, తలకు గాయాలు అయినట్టు రాము అన్నారు. దీనిపై సఖినేటిపల్లి పోలీసు స్టేషన్కు ఎటువంటి సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

కూటమి మేనిఫెస్టోపై బీజేపీకి నమ్మకం లేదు



ఆలమూరులో ప్రచారం రథంపై అభివాదం చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

- మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మరు
- విశ్వసనీయతకు మారుపేరు సీఎం జగన్
- ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: ప్రతిపక్ష కూటమి మేనిఫెస్టోపై ఆ పార్టీల పొత్తులో ఉన్న బీజేపీకి నమ్మకం లేదని, అందుకే ఆపార్టీ అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష కూటమి మేనిఫెస్టోలో ప్రధాని నరేంద్రమోదీ ఫొటో లేకపోవడాన్ని బట్టి కూటమిలో ఉన్న గందరగోళ పరిస్థితులను సూచిస్తుందన్నారు. ఆలమూరు, కొత్తూరు, జిల్లెళ్లపేట గ్రామాల్లో శుక్రవారం ఆయన సుడిగాలి పర్యటన చేసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, సర్పంచ్ నేలపూడి లావణ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఎంపీటీసీ ఉన్నమట్ల విజయకుమారి, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఇంటింటా మహిళలు పూలవర్షం కురిపించి హారతులు అందించి నుదుట కుంకుమను దిద్ది తమ అభిమానాన్ని చాటుకున్నారు. వృద్ధులను, దివ్యాంగులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న ఆదరణ మరువలేనిదని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వివరించారు. రాష్ట్రాభివృద్ధి కోసం మరోసారి ఫ్యాన్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి జగన్ను మరోసారి సీఎం పీఠంపై కూర్చోబెట్టాలన్నారు. అలాగే ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రాపాక వరప్రసాద్ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



కొత్తూరులో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఇచ్చిన హామీలన్నీ 99 శాతం నెరవేర్చాం

గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చడంతో పాటు గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేశామని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అన్నారు. గ్రామాల్లో సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే పాలన తీసుకువచ్చామన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించిన ఘనత సీఎం జగన్కే దక్కుతుందన్నారు. ఇచ్చిన మాటకు కోసం అహర్నిశలు ప్రజా సంక్షేమంపై దృష్టి సారించి హామీలను నెరవేర్చి విశ్వసనీయతకు మారుపేరుగా సీఎం జగన్ రాష్ట్ర చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయారని ఆయన కొనియాడారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, నెక్కంటి వెంకట్రాయుడు, నామాల శ్రీనివాసు, నల్లి రాజు, మోటుపల్లి వెంకన్న, నాంద్ర నాగమోహన్రెడ్డి, సర్పంచ్లు వనుం చిన్నావతి తదితరులు పాల్గొన్నారు.

జగన్ నాయకత్వానికి తిరుగు లేదు



పార్టీలో చేరిన నేతకి కండువా వేస్తున్న రాజోలు అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

మామిడికుదురు: సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి నాయకత్వానికి తిరుగు లేదని రాజోలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పేర్కొన్నారు. మగటపల్లికి చెందిన టీడీపీ నేతలు విప్పర్తి సత్యమూర్తి, గెద్దం బాపూజీ, మోకా సందీప్, ములపర్తి నాగేంద్ర, బీఎస్పీ నేత యాలంగి బాబ్జి, ఈదరాడ గ్రామానికి చెందిన జనసేన నేత పెదపూడి త్రిమూర్తులు, టీడీపీ నేత గిడ్డిం చిన్న తదితరులు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి సూర్యారావు, ఇజ్రాయిల్ పార్టీ కండువాలు కప్పి వారిని సాధరంగా వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. పార్టీ సీనియర్ నేత భూపతిరాజు సత్తిబాబురాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సూరిశెట్టి బాబి, మండల శాఖ అధ్యక్షులు బొలిశెట్టి భగవాన్, ఉప సర్పంచ్ మట్టా గంగయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు బండారు పండు, యెరుబండి సూరిబాబు, చేట్ల సత్యనారాయణ, యెరుబండి సత్యనారాయణమూర్తి, వడ్డే ఆదిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి త్రైత సిద్ధాంత సేవా సమితి మద్దతు

రాజోలు: త్రైత సిద్ధాంత ప్రభోద సిద్ధాంత సేవా సమితి వైఎస్సార్ సీపీకి మద్దతు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం తాటిపాకలోని మాజీ మంత్రి, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావును సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రోధి నామ సంవత్సర త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్ను గొల్లపల్లి సూర్యారావు ఆవిష్కరించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పథకాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీకి త్రైత సిద్ధాంత సేవా సమితి సభ్యుల మద్దతు ఉంటుందన్నారు. కమిటీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, హనుమంతరావు, బ్రహ్మాజీ, శేషు, విశ్వనాథం, జాహ్నవి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్ను ఆవిష్కరిస్తున్న గొల్లపల్లి సూర్యారావు

సేంద్రియ ఎరువులతో పంటలకు సారం

అంబాజీపేట: సేంద్రీయ ఎరువుల వాడకం ద్వారా భూసారాన్ని పెంచుకోవడంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువ దిగుబడుల కోసం అధికంగా రసాయన ఎరువులు వినియోగిస్తున్న తరుణంలో భూసారం క్షీణించి పైరును తెగుళ్లు కబళిస్తున్నాయి. అవగాహన లోపంతో ఎదురవుతున్న కష్టాలను తొలగించుకోవాలంటే సేంద్రియ ఎరువుల వినియోగం తప్పనిసరని అన్నదాతలు గుర్తిస్తున్నారు. మండలంలో వరి, కొబ్బరి, అరటి, కోకో తదితర పంటలు పండించే భూములకు గొర్రెలు, మేకలు, ఆవుల విసర్జితాలను అందించడంపై ఆసక్తి చూపుతున్నారు. ఈ ఎరువులు భూసారాన్ని కాపాడతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పంటకు జనసత్వాలు ఇచ్చి, నాణ్యమైన దిగుబడుల పెంపుదలకు దోహదం చేస్తాయంటున్నారు. ప్రస్తుత సీజన్లో గొర్రెల మందలు రావడంతో పొలాల్లో నిలగడుతున్నారు. అధిక రసాయన, పురుగుమందుల వినియోగం వల్ల సారం కోల్పోయిన నేలలను సేంద్రియ ఎరువు వినియోగంతో తిరిగి సారవంతం చేయవచ్చని చెబుతున్నారు. పశువుల, గొర్రెల మూత్ర విసర్జనతో భూమిలోని చోడు విరిగిపోతుందని, వీటి విసర్జితాలలో నత్రజని, భాస్వరం, పొటాష్తో పాటు, సూక్ష్మ పోషకాలు లభిస్తాయని రైతులు సత్యనారాయణ, రాజగోపాలం చెబుతున్నారు. మంద కట్టుతో విసర్జితాలు నేరుగా భూమిలోకి వెళ్లడంతో అధిక లాభాలు ఉంటాయని వ్యవసాయాధికారులు చెప్పారన్నారు. మంద కట్టిన తర్వాత భూమిని దుక్కు దున్నుకోవాలన్నారు. పొలాల్లో పశువులను కట్టడం ద్వారా నత్రజని, భాస్వరం, పొటాష్ లభిస్తుందన్నారు. మేలు చేసే సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందుతాయన్నారు. తెగుళ్లు తగ్గుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



మొసలపల్లిలో వరి చేలో ఉంచిన గొర్రెల మంద

5,6,7 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

కొత్తపేట: జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ప్రక్రియ ఈ నెల 5,6,7 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు స్థానిక ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల అధికారి జీవీవీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 1,534 మంది పోస్టల్ బ్యాలెట్ను ఉపయోగించుకోనున్నారని తెలిపారు. అలాగే ఇతర నియోజకవర్గాల్లో పనిచేస్తున్న వారు 320 మంది, ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న వారు 323 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోనున్నారని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో 85 ఏళ్లు దాటిన ఓటర్లు 1,500 మంది ఉండగా వారిలో 63 మంది హోమ్ ఓటింగ్ ఉపయోగించుకోనున్నారని తెలిపారు.

అన్నదాతకు అండగా..

- అన్నదాతలకు సేవలందిస్తున్న రైతు భరోసా కేంద్రాలు
- పి.గన్నవరం నియోజకవర్గంలో 75 కేంద్రాలు
- 41 భవనాల నిర్మాణం
- రూ.13.66 కోట్లు మంజూరు



మామిడికుదురు మండలం మొగలికుదురు ఆర్బీకే భవనం

మామిడికుదురు: రైతులకు అవసరమైన శిక్షణ అందించి, విజ్ఞాన కేంద్రాలుగా వ్యవసాయం రంగానికి సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించింది. వీటి ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నుంచి పంట అమ్మకం వరకు సూచనలు, సలహాలు అందించడం వీటి ప్రధాన ఉద్దేశం. పంట రుణాలు, బీమా, గిట్టుబాటు ధరలు కల్పించేలా ఇవి పని చేస్తున్నాయి. రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన లైబ్రరీల్లో వ్యసాయ అనుబంధ రంగాలకు చెందిన వివిధ మేగజైన్లు, పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మన రాష్ట్రంలో అమల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని, అక్కడ కూడా వీటిని ప్రవేశపెట్టే దిశగా కార్యాచరణ చేపట్టాయి. పి.గన్నవరం నియోజకవర్గంలో మొత్తం 75 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో 65 మంది సిబ్బంది పని చేస్తున్నారు. నియోజక వర్గ పరిధిలో రూ.13.66 కోట్ల వ్యయంతో నూతనంగా 41 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. ఈ కేంద్రాల ద్వారా ప్రస్తుతం రైతులకు సేవలందిస్తున్నారు.



పి.గన్నవరం రైతు భరోసా కేంద్రం

ఎంతో ఉపయోగపడుతున్నాయి



రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలను ఈ కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులతో పాటు రైతులకు ఉపయోగపడే అన్ని మౌలిక సదుపాయాలు వీటి ద్వారా కల్పించడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు రైతులకు ఎంతో అండగా నిలుస్తున్నాయి.

– కదలి వెంకటేశ్వరరావు, రైతు

ఆదర్శంగా నిలుస్తున్న ఆర్బీకేలు



రైతులకు గ్రామ స్థాయిలోనే అన్ని సేవలు అందుబాటులోకి తీసుకు రావాలన్న ప్రభుత్వ నిర్ణయం ఆదర్శంగా నిలుస్తోంది. గతంలో వ్యవసాయానికి సంబంధించి ఏ అవసరం వచ్చినా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. గ్రామంలోనే అన్ని సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి.

– తాడి స్వామీజీ, రైతు, నగరం

మరలా సీఎంగా జగన్ని గెలిపిద్దాం



అయినవిల్లి మండల శంకరాయగూడెంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విప్పర్తి వేణుగోపాలరావు

అయినవిల్లి: రాష్ట్రంలో మరోసారి సీఎంగా వైఎస్ జగన్మోహన్రెడ్డిని గెలిపిద్దామని ఆయనతోనే రాష్ట్రం పురోగతి వైపు పయనిస్తుందని పి.గన్నవరం నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. శుక్రవారం క్రాప, శంకరాయగూడెం, కె.జగన్నాథపురం గ్రామాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విప్పర్తికి గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. ఎన్నికల ప్రచారంలో మిగిలిన అభ్యర్థుల కంటే ముందజంలో పయనిస్తున్నారని విప్పర్తి అఖండ మెజారిటీతో గెలుపొందుతారని మహిళలు ఆశీర్వదించారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందాలంటే మరలా సీఎంగా జగన్మోహన్రెడ్డి గెలుపొందాలన్నారు. చంద్రబాబు, పవన్కల్యాణ్ల కూటమి కుయుక్తులను చిత్తుగా ఓడించాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను, జగన్మోహన్రెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మందపాటి కిరణ్కుమార్ మాట్లాడుతూ జగన్మోహన్రెడ్డిని సీఎంగా చేయడం ద్వారానే రాష్ట్రంలోని పేదరికాన్ని తరమికొట్టవచ్చన్నారు. కార్యక్రమంలో గంజి పేరయ్యనాయుడు, బొక్కా కామేశ్వరరావు, దామిశెట్టి అంజి, మేడిశెట్టి శ్రీనివాస్, పాటి రవికుమార్, నవరపు వేదుకొండలు, కుడుపూడి రామకృష్ణ, పాటి శంకర్, మట్టపర్తి స్వామి, గుత్తుల శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు. క్రాప గ్రామంలో దామిశెట్టి అంజి ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి విప్పర్తి వేణుగోపాలరావు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. వారిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఓటును సార్థకం చేసుకోండి



కేశనపల్లిలో మాట్లాడుతున్న అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: ప్రతి పక్షాలకు వేసే ఓటు నిరర్థకమని, వైఎస్సార్ సీపీకి ఓటు వేస్తేనే సార్థకమవుతుందని మాజీ మంత్రి రాజోలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం మండలంలోని కేశనపల్లిలో సొసైటీ అధ్యక్షుడు యెనుముల నారాయణస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సీపీకి ఓటు వేసి జగన్ను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, బొంతు రాజేశ్వరరావు, అడబాల కృష్ణారావు, సాధనాల రంగ, యడ్ల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యకర్తల సమావేశం

సఖినేటిపల్లి: మండలంలోని గొందిలో శుక్రవారం మండల బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా పాల్గొన్నారు. స్థానికుడు బొమ్మిడి నరసింహస్వామి ఆధ్వర్యంలో స్థానికులు కొంత మంది ఆ పార్టీలో చేరారు. వీరికి వేమా పార్టీ కండువాలు వేశారు. ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఆకర్షితులై తమ పార్టీలో చేరారని ఆయన అన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కిసాన్మోర్చా డైరెక్టర్ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామ కృష్ణంరాజు, నాయకులు చెల్లింగి త్రినాథ్, రావూరి బాబ్జీ, బోణం నాయుడు, జీవీవీ సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, వై.సతీష్, ఎ.వెంకట్రావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బ్రహ్మాస్త్రాలు



గోగన్నమఠంలో గజమాలలతో ఇజ్రాయిల్, సూర్యారావులకు స్వాగతం

మామిడికుదురు: సీఎం జగన్మోహన్రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీకి బ్రహ్మాస్త్రాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, రాజోలు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. గోగన్నమఠం, మగటపల్లి, కొమరాడ, ఈదరాడ, మామిడికుదురు, గెద్దాడ గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఇందుకూరు నర్సింహరాజు, బండారు కాశీ గజమాలలతో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, మాజీ మంత్రి సూర్యారావును గోగన్నమఠంలో సత్కరించి, ఘనంగా స్వాగతం పలికారు. ప్రచారం రథంపై తిరుగుతూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావును గెలపించి, సీఎం వైఎస్ జగన్కు కానుకగా ఇవ్వాలని కోరారు. పార్టీ నేతలు భూపతిరాజు సత్తిబాబురాజు, బొలిశెట్టి భగవాన్, కుసుమ వనజకుమారి, సూరిశెట్టి బాబి, కటకంశెట్టి ఆదిత్య, చేట్ల సత్యనారాయణ, జక్కంపూడి వాసు, సాగి పీఆర్వీఎస్ఎస్ నర్సింహవర్మ, యెరుబండి సూరిబాబు, వలవల సత్యమూర్తి, ఎండీవై షరీఫ్, నయినాల రామకృష్ణ, గెద్దాడ నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు



కొత్తూరులో పార్టీలో చేరిన నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: మండలంలోని ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్లో ప్రతిపక్ష కూటమికి చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి వారందరికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆకర్షితులై పార్టీలో చేరిన వారందరికి సముచిత స్థానం కల్పిస్తానని, కుటుంబసభ్యుల మాదిరిగా అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వారు మాట్లాడుతూ కులమతాలకతీతంగా అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న సీఎం జగన్ పాలన పట్ల ఆకర్షితులై తాము వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు తెలిపారు. ప్రతిపక్ష కూటమిని నమ్మే పరిస్థితిలో రాష్ట్రంలో ఎవరూ లేరన్నారు. గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని మాజీ సీఎం చంద్రబాబు మళ్లీ ఓటు అడిగి నైతిక హక్కు లేదని విమర్శించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని నాలుగోసారి భారీ మెజారిటీతో గెలిపించుకుని సీఎం జగన్కు కానుకగా ఇస్తామని పేర్కొన్నారు.

జనసేన అభ్యర్థి ప్రచారం

అంబాజీపేట: జనసేన పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్మాధుర్లు నందంపూడి, తొండవరం, వాకలగరువు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. మద్దతుదారులతో కలసి వీరు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

మామిడికుదురు: పెదపట్నం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న 22 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను పంచాయతీ కార్యదర్శికి జి.మైథిలికి అందజేశారు. సీఎం జగన్మోహన్రెడ్డి తమకు వలంటీర్లుగా అవకాశం కల్పించి ఉపాధి చూపారని వలంటీర్లు పేర్కొన్నారు. ఆయన పెట్టిన కల్పించిన ఉపాధితో జీవనం పొందుతున్నామన్నారు. వైఎస్ జగన్మోహన్రెడ్డి రెండో సారి సీఎం కావాలన్నది ప్రజలందరి ఆకాంక్ష అన్నారు. తాము కూడా అదే కోరుకుంటున్నామని, ఈ బృహత్తర కార్యక్రమంలో పాలు పంచుకునేందుకు వలంటీర్ ఉద్యోగం అడ్డంకిగా మారిందన్నారు. దానికి రాజీనామా చేసి ఇక నుంచి నేరుగా తాము వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తామన్నారు. పి.గన్నవరం అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు విజయం కోసం తాము కృషి చేస్తామన్నారు.

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి గ్రామానికి చెందిన 34 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. సీఎం జగన్మోహన్రెడ్డి కావాలని ఆయనతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు. నేరుగా పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామన్నారు. తమ రాజీనామా ప్రతులను స్థానిక పంచాయతీ కార్యదర్శికి, ఎంపీడీఓకు అప్పగించినట్లు తెలిపారు.